# గగన గమనం

ఇది విమానయానం ఎంతవరకు సురక్షితమనే విషయం మీద వ్యాసమని మీరు భావిస్తారేమో! అయినప్పటికీ, మీరు అపోహ పడ్డారని చెప్పడానికి నాకు గుండెధైర్యం చాలదు. ఎందుకంటే, రచయితల రాతల మీద తీర్పు రాసేది, చదువరులే కదా! కానీ, నా ధ్యేయం, రెండు విమాన ప్రయాణికుల్లో, ప్రయాణికులకు, విమాన కర్మచారులకు, విమానాలకు, సంభవించిన విషయాలలో నాకు తెలిసినంత వరకు వాస్తవాలు మీముందు వాస్తవంగా ఉంచడమే.

ఒక్కొక్క సంఘటన గురించి ఒక ప్రత్యేక విధంలో..., అంటే, కొన్ని చిలవలు, పలవలు చేర్చి పాఠకుల సమక్షంలో సమర్పించిన కథలో గొప్పదనం..., లేకుంటే చప్పదనం ఉండవచ్చు లేదా అసలు కథే లేకపోవచ్చు. కొన్ని కథానికల్లో తరతరాలుగా జరిగిన విషయాలు, సంగ్రహంగా రాసి ఉంటాయి. వేరే కొన్ని కథానికల్లో, అతి చిన్న సంఘటనలనే, ఒకటో రెండో నిమిషాల్లో జరిగిన వాటి గురించి, పేజీలు, పేజీలు పెంచి రాస్తారు.

ఇప్పుడు మీరు చదువబోయేది, రెండు సంఘటనల గురించి కావడం వలన, ఒకే ప్రసవంలో కవలలు పుట్టినట్టు... మద్రాసులో జెమినీ స్టూడియో చిహ్నమైన బాకాలు ఊదుతున్న ఇద్దరు బాలకులలాగా... ఏ అమ్మాయికైనా, అబ్బాయికైనా శరీరంలో ప్రధానాంగాలన్నీ రెండేసి చొప్పున ఉన్నట్లు, ఈ కథలో రెండు కథలుండటం వలన దీనిని "కథాయుగళం" అని నామకరణం చేయవచ్చును.

కథ ప్రారంభంలోనే, విమాన ప్రయాణం ఎంతవరకూ సురక్షితమనే విషయమై ఒక చర్చ జరగబోతున్నట్లు సూచన ఇవ్వడం జరిగింది. ప్రయాణ విమాన నిర్మాతలూ, ఆ విమానాలను నడిపే పెద్ద పెద్ద కంపెనీలు, చెప్పుకొచ్చేదేమిటంటే, భూ, జల, వాయు మార్గాల ప్రయాణాల్లో కలిగే ప్రమాదాల సంఖ్యలో గానీ, అట్టి ప్రమాదాలలో మరణాల సంఖ్యలో గానీ, ఎక్కువ శాతం భూ మార్గ ప్రయాణీకులకి జరుగుతుందన్న మాట నిజమే. ఒక సైకిలు కూడా ఎక్కకుండా నటరాజ సర్వీసులో రోడ్డు ప్రక్కనుంచి వెళ్ళేవాళ్ళని కూడా యమపురికి గానీ, యమధర్మరాజు తాండవ నృత్యం చేసే ఆసుపత్రులకిగానీ, డిస్పాచ్‌చేసే ఎన్నో యాంత్రిక వాహనాలు, అధిక వేగంతో గానీ, మామూలు వేగంతో కానీ మన రోడ్లపై అటూ, ఇటూ పరిగెడుతూనే ఉంటాయి. పాతరోజుల్లో సప్తసాగరాలు, దాటిపోయే జలనౌకల్లో

ప్రయాణాలు చేసేవాళ్ళు చాలమంది ఉండేవారు. కానీ, ఈ రోజుల్లో విదేశాలకు వెళ్ళేవాళ్ళు ఎక్కువమంది ఆకాశమార్గాన్నే కదా వెళ్ళేది. విమానాల్లో కొన్ని గంటలలో గమ్యస్థానానికి చేరగలిగిన ఈ రోజుల్లో, నెలల తరబడి తీరాన్ని తాకాలనే తీరని ఆశతో సముద్రయానం చేయడానికి మానవులే కాదు, వానరులు కూడా ఇష్టపడరు. ఎక్కువ మంది సముద్రయానం చేయకపోయినా కూడా, ఈతకొట్టేవాళ్ళు, కాలవలు, నదులు, చెఱువులు దాటేవాళ్ళు, వరదలకు గురయ్యేవాళ్ళు లక్షలకొలది ఈ ప్రపంచంలో జలసమాధి చెందుతారు.

భూ, జల, వాయు మార్గాలలో, ప్రయాణీకుల ప్రమాదవశాత్తు సంభవించే మరణాల సంఖ్యలు పోల్చి చూస్తే, విమాన యాత్రీకుల మరణాల శాతం చాల తక్కువగానే ఉంటుంది. విమానాల ఖరీదు ఎక్కువ కావడమే దీనికి ప్రధాన కారణం. ఒక్కొక్క విమాన దుర్ఘటనలో మృతిచెందే వాళ్ళందరి విలువ ఆ విమానపు ఖరీదుతో పోలిస్తే దానిలో వందవవంతు కూడా కాకపోవచ్చు.

ఆకాశమార్గాన వెళ్ళే విమానాలకు పశువుల బెడద అనే ట్రాఫిక్ ప్రాబ్లమ్ ఉండదు. ఒక విమానం, మరొక విమానంతో ఢీ కొట్టే అవకాశాలు కూడా చాలా తక్కువ. ఆకాశంలో పైకిగానీ, కిందికి గానీ, కుడివైపుకు గానీ, ఎడమవైపుకు గానీ, విమానాల్ని దిశ మళ్ళించడానికి విఘ్నాలేమీ లేవు కదా! కానీ, ఈ ఎగిరే విమానాలకు రివర్స్‌గేరు ఉండకపోవచ్చు. అందుకే, ఎటువంటి పరిస్థితుల్లో కూడా ప్రతిలోమ ప్రయాణం సాధ్యం కాదేమో! ఎగిరే పక్షులకు గానీ, కీటకాలకు గానీ, అటువంటి సామర్థ్యం ఉందా? లేదనే అనుకుంటున్నాను. అవన్నీ పురోగాములు మాత్రమే. వెనుకకి నడిచి గానీ, పరుగెత్తి గానీ, గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పడిపోయిన మనుషులున్నారని విన్నాను.

విమానప్రయాణం సురక్షితమని చెప్పడానికి ఆర్థికపరమైన ఒక కారణం ఉంది. “ది డే యూ ఇన్స్యూర్ యూ ఆర్ సెక్యూర్” అని ఇన్స్యూరెన్స్ కంపెనీ వాళ్ళు అంటారు, కానీ, వివాహ బంధాన్ని వైవాహిక బంధనంగా పరిగణించే వాళ్ళు ఎంతో మంది ఉంటారు. గృహలక్ష్మినిగానీ, ప్రత్యక్షదైవమైన పతిదేవుణ్ణిగానీ, ఇష్టపడేవాళ్ళకంటే, ధనలక్ష్మిని ఆరాధించేవాళ్ళే ఎక్కువ మంది ఉండేటపుడు, అలాంటి కుటుంబాల్లో, ఇలాంటి పాలసీలు తీసుకోవడం, యజమాని కరిచే కుక్కని డబ్బిచ్చి కొనుక్కోవడమే అవుతుంది. అవన్నీ ఎలా ఉన్నా, విమానప్రమాదాల్లో మరణించేవారి దగ్గరి బంధువులు కావడం, విమాన ప్రయాణానికి అనుకూలమైన ఒక పాయింటేకదా! విమాన దుర్ఘటనలో నా భర్త చనిపోయారని చెప్పడం ఎంతో గొప్పగా ఉంటుంది కానీ, ఆయన్ని ఒక సైకిల్ ఢీ కొట్టడం వలన చనిపోయారని కానీ, ఒక ఎద్దుల బండి అతనిపై నుంచి పోయి చనిపోయారని చెప్పడం కానీ, ఎంతో సిగ్గుగా ఉంటుంది.

చెప్పబోయే రెండు విమాన ప్రమాదాల్లో మొదటిది దాదాపు ఇలా జరిగింది.

ఒక జెట్ విమానం, ఎయిర్‌పోర్టు నుంచి పైకెగిరి, ఒక గంటసేపు ఆకాశాన్ని చీల్చి వెళ్ళే ప్రయత్నంలో వుంది. భూమి నుంచి అంటే సముద్రమట్టం నుంచి ముప్ఫైవేల అడుగులపైన, అంతరిక్షాన్ని, తన రెక్కల క్రింద లొంగదీసుకుని గమిస్తోంది, ఆ యాంత్రిక పక్షి. యాత్రికులకు, జలపానం ఇవ్వడమనే మొట్టమొదటి అతిథి మర్యాదా కార్యక్రమం ముగిసింది.

కాక్‌పిట్‌లో ఇద్దరు పైలెట్‌లూ తమాషా కబుర్లు చెప్పుకుంటూ, నవ్వుతూ కూర్చున్నారు. ఆ వ్యోమనౌకలో ఉన్న ఎయిర్ హోస్టెస్‌లలో అందరికన్నా అందమైన అమ్మాయే కదా వారి దగ్గరుంది. ఆ ఇద్దరిపైలెట్‌లకూ, తినడానికి, తాగడానికి కావలసినవన్నీ అందించింది.

ఒక్కసారిగా ఏమైందంటే,

ఒక పైలెట్ తన సీట్‌బెల్ట్‌తీసి లేచాడు. అది బాత్రూమ్‌కు వెళ్ళడానికో లేదా ఎయిర్‌హోస్టెస్‌తో కాస్సేపు పాశ్చాత్య నృత్యం చేయడానికో తెలియందు. అంతలో, అతనికి ముందున్న కిటికీ అద్దం (విండ్‌స్క్రీన్‌గ్లాస్) బయటికి ఎగిరిపోయింది. దానితో పాటే అతను కూడా ఒక స్విమ్మింగ్ పూల్‌లోకి డైవ్‌చేస్తున్నట్టు పెద్ద కేకతో బయటికి తోసివేయబడ్డాడు. ఆ కాక్‌పిట్‌లో బిగించిలేని భాగాలన్నీ ఆ కిటికీ ద్వారా బయటికెగిరిపోయాయి. మూడొంతులు బయటికెళ్ళిపోయిన అతను ఒక్కమారు కాళ్ళు బాగా పంగజాపి కిటికీ అంచులకి వేలబడి ఆత్మరక్షణకై పెనుగులాడుతున్నాడు. ధైర్యవతి అయిన ఆ ఎయిర్ హోస్టెస్ ఎంతో సమయస్ఫూర్తితో, ఆ పైలెట్ కాలొకటి లోపలికి లాగి, తను ఎగిరిపోకుండా, కింద కూర్చుంది. కాక్‌పిట్‌లో ఉన్న ఆ ముగ్గురికి ఊపిరందటం లేదు. ఒక జీవన్మరణ పోరాటం అక్కడ జరుగుతోంది. వీలైనంత త్వరలో దగ్గరగా ఉన్న విమానాశ్రయంలో దిగడానికి కఠిన ప్రయత్నాలలో మునిగి ఉన్నాడు, రెండో విమాన పైలెట్. మరో పైలెట్ బయటికి అలా వేలాడబడటమే కాకుండా, శరీరంపైకి, కిందికి వేగంగా కదులుతూ... ఆ విమానాన్ని పగలకొట్టేస్తాడా అన్నట్లుగా అతని చేతులు కొడుతున్నాయి. ఆ ఎయిర్‌హోస్టెస్ మాత్రం భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, తన శాయశక్తులా ఆ పైలెట్ మరణగర్తంలోకి జారిపడకుండా ప్రయత్నిస్తోంది. అతని రెండు కాళ్ళకీ గాయాలయ్యాయి, కానీ, వాటినుంచి స్రవించే రక్తపు బొట్లు కూడా ఆకాశంలోకి ఎగిరిపోతున్నాయి. నాలుగైదు నిముషాల్లో విమానంలోంచి బయటికి పోయే గాలి ఉధృతం తగ్గింది. కానీ, బయటిగాలి జోరు వలన ఆ పైలెట్ శరీరం అదుపులో లేకుండా విమానం బాహ్యతలం మీద చేస్తున్న దాడి కొనసాగుతూనే ఉంది. కాలుపట్టుకుని లాగుతున్న ఎయిర్ హోస్టెస్‌కి, లోపలున్న రెండో పైలెట్‌కి ఇప్పుడు ఒక

విషయం అర్థమైంది.... బయటికి వేలాడుతున్న పైలట్ స్పృహ తప్పి ఉన్నాడు. విమానం నడుపుతున్న పైలట్, విమానాన్ని ఎమర్జెన్సీ లాండింగ్ చేయడానికి దిగిన వెంటనే, కావలసిన భద్రతా ఏర్పాట్లకి అవసరమైన సందేశాలు పంపించడంలో మునిగి ఉన్నాడు.

భగవంతుడి అపారమైన కృప వలన కాబోలు, ఆ విమానం ఏమంత ధ్వంసం కాకుండా, విమానాశ్రయపు నేలని తాకింది. ఏ మాత్రం ఆలస్యం చేయకుండా, స్పృహ తప్పిన ఆ పైలెట్‌ని దగ్గర్లోనే ఉన్న ఆసుపత్రిలో చేర్పించాడు.

రక్తాభిషిక్తమై, స్పృహ కోల్పోయిన ఆ మనిషి శరీరంపై లెఖ్ఖలేనన్ని గాయాలున్నా కూడా, ఆరు నెలల చికిత్సానంతరం, అతను స్వస్థత చెందాడు. అంతేకాదు, ఒక సంవత్సరంలో పైలెట్‌గా తన విధి నిర్వమణకు సమర్థతను పొందాడంటే, అది ఆరోగ్య శాస్త్రం సాధించిన అత్యద్భుత పురోగతి వల్ల మాత్రమేనని చెప్పలేము. ఆ సర్వేశ్వరుడి కరుణా కటాక్షమే లేకపోతే ఎంత ఘోరం జరిగుండేది!

ఇంచుమించు, ప్రాణం పోగొట్టుకునే పరిస్థితి నుంచి తనకి ప్రాణరక్షణ కల్పించిన ఎయిర్ హోస్టెస్‌ని, ఆ విమాన పైలెట్ ప్రాణేశ్వరిగా స్వీకరించడం, మరో ఆరునెలల్లో జరిగిన మంగళకరమైన సహజ పరిణామంగా లిఖితమైంది.

సాధారణంగా విమాన ప్రయాణాల్లో ప్రమాదాలు, విమాన ప్రయాణాలుగా కానీ, మంగళపర్యవసాయి అయిన ఒక కథగా కానీ, పరిణమించాలనే నియమమేమీ లేదు. ఎక్కువ ప్రమాదాలు జరిగేది యాంత్రికలోపం వల్ల కాకపోవచ్చు. ఎందుకంటే, తొంభైశాతం వరకూ అవి మనుష్యుల అశ్రద్ధ వలననే జరుగుతాయి.

విదేశీ కంపెనీ యొక్క అంతర్జాతీయ సర్వీసులో విమానం ఏదయినా, తొణక్కుండా, బెణక్కుండా, భూమికి ముప్ఫైవేల నుంచి, నలభై అయిదువేల అడుగుల ఎత్తున సజావుగా, ఫ్లయింగ్ సాసర్‌లా జారుతూ వెళ్తుంది. ఈ ఎగిరే పళ్ళెం గురించి మాట్లాడేటప్పుడు, రావణబ్రహ్మగారి పుష్పక విమానం గుర్తుకొస్తుంది. పురాణకాలంలో ఆ రాక్షసరాజుకు మాత్రమే విమానముందని విన్నాము. రావణుడు, అతని సుతుడు ఇంద్రజిత్తు, ఇంకా కొందరు రాక్షస ప్రముఖులు కూడా స్వయంగా ఆకాశమార్గాన విహరించే వారని పురాణాల్లో ప్రస్తావనలున్నాయి. నారద మహర్షి కూడా తన తంబురను మీటుతూ పధ్నాలుగు లోకాల నన్నింటిలో ఒక క్యూలెక్స్ దోమలాగా తిరిగేవారట. రాక్షసుల్లో చామందికి అంతరిక్ష యానం సాధ్యమయ్యింది. కానీ, దశావతారాల్లో ఒకరైన శ్రీరామచంద్రుడు, ఆయన అనుచరులకు మాత్రం ద్విపాదచలనమే సాధ్యమైంది. వానరసేనలకు, శ్రీరామ లక్ష్మణాదులకు సేతుబంధనా

నంతరం శ్రీలంకకి చేరడానికి నడిచి నడిచి చాలా అలసిపోవలసి వచ్చింది. కొంతమంది అభిప్రాయం ప్రకారం, ఆ రామరావణ యుద్ధం పుష్పకవిమానం కోసమే జరిగిందట. మారీచుణ్ణి పట్టుకోవడానికి రాముణ్ణి పంపించి, రాముడిని పట్టుకురావడానికి లక్ష్మణుడిని పంపించి, ఇక కొంతసేపు హాయిగా ఉందామనుకుంది. ఎన్నడూ ఏకాంతం దొరకని సీతాదేవి, కానీ, వెళుతూ, వెళుతూ, లక్ష్మణుడు ఆ రేఖ గీయకుండా ఉంటే, ఒక లేడిలా, ఆ సుందరారణ్యంలో గెంతులేస్తూ విహరించి ఉండేదానిని కదా అని అనుకుంది. కానీ, వదినగారి హౌస్ అరెస్టుకి ఏర్పాట్లు చేసిన తరువాతే, నిర్దయుడైన ఆ మరిది బయటకు వెళ్ళాడు. ఆ విధంగా సీతాదేవి బోర్ ఫీలవుతున్నప్పుడు, అందగాడైన ఒక సన్యాసి వచ్చి, "మాయమ్మ సీతమ్మా! ఎందుకిలా వంటరిగా కూర్చొన్నావు? దాహంగా ఉంది, తాగడానికేమయినా ఇస్తావా?" అపి అడిగినప్పుడే. "అయ్యో! నా పర్ణశాలలో ఛిల్డ్‌బీర్ ఉంటే అదే ఇచ్చుండేదాన్ని కదా!" అని సీతాదేవి అనుకుంది. కానీ, కోకోకోలా కూడా లేని ఆ కాలంలో పాపం, సీతాదేవి, చల్లటి కూజా జలం మాత్రమే ఇవ్వగలిగింది. ఆ జలపానంతో సంతృప్తుడైన ఆ సన్యాసి "సీతాదేవీ! ఒంటరిగా కూర్చుని, కూర్చుని మీకు విసుగ్గా లేదా? మీకు అభ్యంతరం లేకపోతే, కాస్సేపు మనం నా హెలికాప్టర్‌లో ఈ అడవి అందాలన్నీ చూసి వద్దామా?" అని అడిగాడు.

విశాల వికసిత నయనాలతో సీతాదేవి అడిగింది, "మునీంద్రా! ఈ హెలికాప్టర్ అంటే ఏమిటి?"

"తిన్నగా పైకెగిరి క్రిందికి దిగగల సామర్థ్యం ఉన్న ఒక వ్యోమనౌక అది. దానిలో అలా అలా పయనిస్తూ ఉంటే, సుందరమైన ఈ భూభాగాన్నంతా వీక్షించవచ్చును. ఒక అరగంటసేపు గగన విహారం చేయడం మీకు ఇష్టమే కదా!"

"అవును, ఇష్టమే. కానీ, లక్ష్మణరేఖను దాటేదెలా?"

"చిన్నప్పుడు మీరు లాంగ్‌జంప్ కానీ, హైజంప్ కానీ ప్రాక్టీసు చేయలేదా? దీనికి ఒక చిన్న లాంగ్ జంప్ చాలు. కుంటాట కానీ, తొక్కుడు బిళ్ళాట కానీ, ఆడుంటారే! ఒక కాలితో అలా దూకినా కూడా సరిపోతుంది."

సంతోషంతో గెంతులేస్తూ, సీతమ్మ అతనితో వెళ్ళింది. జటాయు యుద్ధ సంఘటన వరకూ, సీతమ్మకు ఆ గగన విహారం నచ్చే ఉంటుంది. ఆ విహంగనాథుడే సీతమ్మకు రావణుని గురించీ అతని ఉద్దేశ్యం గురించి తెలియజేయడం జరిగింది. తరువాత విలపిస్తే మాత్రం ప్రయోజనమేముంటుంది? చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు.

రామ రావణ యుద్ధం తరువాత, శ్రీరామ చంద్రమూర్తికి శ్రీలంక అక్కర్లేదని చెప్పారట. అది విభీషణుడికి వదిలేసి, ఒక్క వస్తువును మాత్రం తనతో తీసుకు వెళ్ళారట. అది పుష్పకవిమానం. శ్రీరామచంద్రుడే అది కావాలని అడిగితే విభీషణుడు ఇవ్వకుండా ఉండగలడా? తరువాత, పాపం, ఆ సీతమ్మకి అగ్ని పరీక్ష, రెండోసారి అరణ్యవాసం విధించిన పురుషోత్తముడికి మాత్రం ఆ వ్యోమయానపిచ్చి రోజు రోజుకూ పెరుగుతూ వచ్చింది. ఒక పౌరాణిక అంజయ్యలాగా.

మన విదేశీవిమానం నలభైవేల అడుగుల ఎత్తులో జారుతూ వెళ్తుందని కదా, మనం చెప్పుకున్నాము. దానిలో విమాన సిబ్బందితో కలుపుకుని దాదాపు రెండువందల అరవై మంది ఉన్నారు. ఆ ప్రయాణికులలో ముప్పై తొమ్మిదిన్నరశాతం మంచి నిద్రలో ఉన్నారు. కొంతమంది పేపర్లూ, మాగజైన్లూ చదువుతూ ఉంటే, మరికొంతమంది తమ వాగ్ధాటితో దండిస్తూ ఉన్నారు. మిగతా వాళ్ళు మౌత్‌లుకింగ్ ఏజెంట్లుగా వర్తిస్తున్నారు. సర్వమూ సత్యం – శివం సుందరంగా ఉంది.

కాక్‌పిట్‌లో నలభై అయిదేళ్ళ వయసున్న పైలెట్‌గారి పధ్నాలుగూ, పన్నెండేళ్ళ వయసు గల ఇద్దరు సుపుత్రులూ, విమాన చాలనలో ప్రాథమిక థియరీ క్లాసు నేర్చుకుంటున్నారు. ఆ పిల్లలకి "పైలటింగ్"గురించి వివరించడంలో కో-పైలెట్‌కి ఎంతో ఉల్లాసాన్ని కలిగించింది. నిబంధనల ప్రకారం కాక్‌పిట్‌లోపల ప్రదేశించడానికి, విమాన ప్రయాణీకులకు అనుమతి ఉండదు.

కో-పైలెట్ లావెట్రీకి వెళ్ళేటప్పుడు ఆ వాత్సల్యమూర్తి అయిన ఆ తండ్రి, తన పిల్లలకు "ఆటోపైలెట్" గురించి చెప్పడం జరిగింది. ఆ పిల్లలకు పైలెట్‌లు కూర్చునే సీట్లో కూర్చోవాలని కోరిక. దాని వలన కనీసం, రెండు మూడు నిముసాల పాటయినా, ఆయువ సోదరులకు, ఒక పెద్ద విమానం నడుపుతున్నట్టు అనుభూతి. సంతృప్తి... అమితానందం కలుగుతుంది. కదా! దానికే, తండ్రి కూడా తన సీట్లోంచి లేచాడు. పిల్లలిద్దరినీ, ఆ సీట్లలో కూర్చోబెట్టి, సీట్ బెల్ట్‌లు కట్టాడు. "ఒరేయ్, అబ్బాయిలూ! ఇప్పుడు విమానం ఆటో పైలెట్‌తో నడుస్తోంది. మీరు కదలకుండా కూర్చోండి. కంట్రోల్స్ ఏమీ ముట్టుకోకూడదు." అని విధేయతా విషయంలో అగ్రగణ్యులైన ఆ పిల్లలిద్దరికీ ఉపదేశమిచ్చి, మెల్లగా కాక్‌పిట్ బయటికి వెళ్ళి ఒక ఎయిర్ హోస్టెస్‌తో రెండు మూడు నిముషాలపాటు సరస సంభాసణలు మొదలుపెట్టాడు.

పధ్నాలుగూ, పన్నెండేళ్ళ వయసున్న ఆ పిల్లలకి అంత వివేకముంటుందా! తండ్రి అటువంటి అవివేకపరమైన పనులు చేస్తూ ఉండగా, అతని రక్తం పంచుకు పుట్టిన ఆ

ఇద్దరు కొడుకులు కాక్‌పిట్‌లో అవీ, ఇవీ లాగడం, నొక్కడం వంటి చిన్న చిన్నపనులు, చేయకుండా ఉంటారా?

ఎయిర్‌హోస్టెస్, ఆమెకు ఎంతో దగ్గరగా ఉన్న పైలెట్ తమ తమ నిలకడలు తప్పి కిందికి పడిపోవడంతో పాటు, పరిభ్రాంతులైన ప్రయాణీకుల అరుపులు, రోదనలు, ఒక గందరగోళ పరిస్థితిని సృష్టించాయి. కిందపడిపోయిన ఆ పైలెట్ నేలమీద పాకుతూ, మోకాళ్ల మీద నడుస్తూ అతికష్టం మీద కాక్‌పిట్‌లోని తన సీటు దగ్గరికి చేరగలిగాడు. ఆ సీట్లో కూర్చొన్న అబ్బాయిని సీట్‌బెల్ట్ తీసేసి బయటికి లాగి, తను ఆ సీట్లో కూర్చుని సీట్‌బెల్ట్ పెట్టుకునే సరికి...

పిడుగు పడినట్టున్న చప్పుడు చుట్టూరా మంటలు. ఆ విమానంలో ఉన్నవాళ్ళలో ఎంతమంది ఆ స్ఫోటన శబ్దం విని ఉంటారో, ఎంతమంది ఆమంటలు చూసుంటారో చెప్పడానికి వీల్లేదు. ఎందుకంటే, ఆ విమానప్రమాదంలో ఏ ఒక్కరూ ప్రాణాలతో బయటపడలేదు.

బ్లాక్‌బాక్స్‌లో... అంటే, వాయిస్ రికార్డర్‌లో, భయాక్రాంతుడైన ఆపైలెట్, తన పిల్లలని తిడుతూ, అరిచిన అరుపులు, శబ్ద నిక్షిప్తమైన చివరిభాగం నుంచి, కోర్ట్ ఆఫ్ ఎంక్వయిరీ వాళ్ళు ఎయిర్‌క్రాష్ ఏర్పడటానికి అసలు కారణం తెలుసుకోగలిగారు.